# బురదమయంగా రహదారి

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



బురదగా మారిన మట్టి రోడ్డు

**మల్హర్:** వర్షాకాలం వచ్చిందంటే మండలంలోని తాడిచర్ల ఉర చెరువు నుంచి ఖమ్మంపల్లి వంతెన వరకు ఉన్న మట్టి రోడ్డు బురదమయంగా మారుతోంది. చిన్నాపాటి వర్షానికే ఈ మట్టి రోడ్డు పలు ప్రాంతాల్లో బురదమయం అవుతోంది. ఎక్కడ చూసిన రోడ్డుపై వరద నీరు నిలిచిపోయి ప్రమాదకరంగా ఉంటోంది. వర్షం కురిసిన సమయంలో రోడ్డుపై బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేస్తున్నామని వాహనదారులు వాపోతున్నారు. తాడిచర్ల ఓపెన్‌కాస్ట్ విస్తర్ణంలో భాగంగా గతంలో ఉన్న బీటీ రోడ్డును ఓపెన్‌కాస్ట్ అధికారులు తొలగించి మట్టి రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డుకు పెద్దపల్లి జిల్లా మంథని వైపు నిత్యం వందల సంఖ్యలో వాహనాల రవాణా సాగుతోంది. మట్టి రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. సంవత్సరాలు గడుస్తున్న బీటీ రోడ్డు నిర్మించడంలో ఆర్అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అలాగే కొయ్యూరు నాగులమ్మ ఆలయం నుంచి తాడిచర్ల వరకు బీటీ రోడ్డు సైతం పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. జిల్లా అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### బీటీ రోడ్డు నిర్మించాలి



“ తాడిచర్ల ఉర చెరవు నుంచి ఖమ్మంపల్లి వంతెన వరకు ఉన్న మట్టి రోడ్డు కారణంగా ఇబ్బందులు పడుతున్నాం. వర్ష కాలం సీజన్‌లో బురదరోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారుతోంది. అలాగే ఇతర సమయంలో మట్టి రోడ్డుపై రాళ్లు తేలి ప్రమాదాలు జరగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మించాలి.

- మల్క కిషన్‌రావు, తాడిచర్ల, మల్హర్

### ప్రతిపాదనలు పంపించాం..

కొయ్యూరు నాగులమ్మ ఆలయం నుంచి ఖమ్మంపల్లి మానేరు వంతెన వరకు హ్యామ్ (హైబ్రిడ్ హ్యానీటి మోడ్)లో కొత్త రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే రోడ్డు పనులు ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం.

- రమేశ్, ఆర్అండ్‌బీ డీఈ , భూపాలపల్లి

## క్లుప్తంగా

### కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

**టేకుమట్ల:** హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద డీటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలపై నేడు(శుక్రవారం) నిర్వహించే ధర్నా కరపత్రాన్ని గురువారం మండలంలోని వెంకట్రావుపల్లి ఉన్నత పాఠశాల ఆవరణంలో డీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్, మోయిన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యను విధ్వంసం చేసే ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించడమే డీటీఎఫ్ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భుజేంద్రాచారి, సుధాకర్, సుమన్, సురేందర్, నాగరాజు, రాజు, సురేష్, స్వామి పాల్గొన్నారు.

### నేడు సన్నాహక సమావేశం

**మల్హర్:** మండల కేంద్రంలోని తాడిచర్లలో నేడు (శుక్రవారం) కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమీక్ష నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### కమిటీ ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులు

**భూపాలపల్లి రూరల్:** పట్టణ స్వర్ణకార సంఘం నూతన కమిటీని జిల్లా కేంద్రంలో గురువారం ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదర్శి కట్టు కోజ్యాల రాజు గురువారం తెలిపారు. అధ్యక్షుడిగా కొండపర్తి శంకరాచారి, ప్రధాన కార్యదర్శిగా కాగితపు శశిధరచారితో పాటు కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు రామగిరి సదానందం, ప్రధాన కార్యదర్శి కట్ట శంకరమూర్తి, ప్రధాన కార్యదర్శి కొండపర్తి శ్రీను, కోశాధికారి బ్రహ్మం, ఉపాధ్యక్షుడు మునిగంటి రాజేందర్, నాయకులు కాగితపు రాజు పాల్గొన్నారు.

### విజయవంతం చేయాలి

**భూపాలపల్లి రూరల్:** ఈనెల 25 నుంచి 29 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే కుల వృత్తుల కళా ప్రదర్శనను విజయవంతం చేయాలని జిల్లా వెనుకబడిన తరగతులు అభివృద్ధి అధికారి క్రాంతి కిరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఐమాక్స్ పక్కన గ్రౌండ్‌లో కళా ప్రదర్శన జరుగుతుందని పేర్కొన్నారు. బీసీ కుల వృత్తులకు సంబంధించిన కళాకారులు కుమ్మరి, కమ్మరి, చేనేత, మేదరి, వడ్రంగి, పూసల, మొదలైన కులవృత్తులవారు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని కుల వృత్తులను ప్రోత్సహించాలని కోరారు.

# ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

**కాటారం:** ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రజల పక్షాన నిలుస్తున్న ఏకైక పార్టీ సీపీఐ అని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు క్యాతరాజు సతీశ్, సుగుణ అన్నారు. మండల కేంద్రంలో గురువారం సీపీఐ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వంద సంవత్సరాలు సుదీర్ఘచరిత్ర కల్గిన సీపీఐ నిరంతరం ఉద్యమాలు చేస్తూ ఆర్థిక సమానత్వం, సమసమాజ స్థాపన కోసం కృషి చేస్తుందన్నారు. ప్రజలను చైతన్యపరుస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఖండిస్తూ రావడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువులు, సరుకుల ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందని, దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే కుట్ర చేస్తుందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, భూ భారతిలో గిరిజనుల దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలన చేసి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో జిల్లా కార్యవర్గ సభ్యులు సాతుకు ప్రవీణ్, జిల్లా సమితి సభ్యులు వేముల శ్రీకాంత్, నేరేళ్ల జోసెఫ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వ్యాధులపై అప్రమత్తత అవసరం

- వైద్యాధికారి మహేందర్



వైద్యం చేస్తున్న డాక్టర్ మహేందర్

**వాజేడు:** వ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మహేందర్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని గణపురం గ్రామంలో జ్వరాల తీవ్రతపై ఇంటింటి సర్వే నిర్వహించారు. గ్రామంలో ఎనిమిది మందికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించి వారికి వైద్యం అందించారు. అనంతరం గ్రామంలోని మురుగు నీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేశారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలని గ్రామ పంచాయతీ సిబ్బందిని కోరారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి 43 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ కోటిరెడ్డి, హెచ్‌వీ వెంకట నర్సమ్మ, సత్య నాగవేణి, చాయాదేవి, శేఖర్ ఆశ కార్యకర్తలు ఉన్నారు.

# గుడిసెవాసులకు పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న వెంకట్రాములు

**భూపాలపల్లి అర్బన్:** పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీ వాసులకు పట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు కోరారు. పట్టణంలోని భగత్ సింగ్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుపేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని మూడేళ్లుగా నివాసం ఉంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు ప్రవీణ్‌కుమార్, శ్రీకాంత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న అధికారులు

**కాటారం:** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో మండల కేంద్రంలోని న్యూ కేంబ్రిడ్జి పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి విష్ణు ప్రతిభ కనబర్చారు. డ్రగ్స్, మత్తుపదార్థాల నివారణ, విద్యార్థుల పాత్ర తదితర అంశాలపై విష్ణు క్లుప్తంగా వివరించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. దీంతో గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ నరేశ్‌నాయక్, అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌లు, డీఈఓ రాజేందర్ విష్ణును ప్రత్యేకంగా అభినందించి బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అన్నమనేని పృథ్వీధర్‌రావు, ప్రిన్సిపాల్ సాయివాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులు

**టేకుమట్ల:** తెలంగాణ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడల్లో మండలంలోని గర్మిళ్లపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన వంగల రితిక, కాసాని కృతిక, నల్లగాశ కావ్యశ్రీ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గంపల స్వామి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను మండల విద్యాధికారి చిదిరాల సుధాకర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కొట్టె ప్రసాద్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రు, పీఈటీ పృథ్వి, సీఆర్‌పీ నాగరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

### ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న సహోద్యోగులు

**టేకుమట్ల:** మండలంలోని పంగిడిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న వంతడుపుల రఘు ఇటీవల హిమాచల్‌ప్రదేశ్‌లో నిర్వహించిన జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ హ్యామర్‌త్రో విభాగంలో ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి కాంస్య పథకాన్ని అందించాడు. కాగా, గురువారం పంగిడిపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సువర్ణరాణి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కొట్టె ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి శారద, వీఓ వసంత, అంగన్‌వాడీ టీచర్లు సౌందర్య, కవిత, ఆశకార్యకర్త సరిత, తదితరులు పాల్గొన్నారు.

### పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



ఫోన్ అందజేస్తున్న ఎస్సై సుధాకర్

**టేకుమట్ల:** రెండు నెలల క్రితం మండలంలోని కుందనపల్లి గ్రామానికి చెందిన ఉమ్మల్ల సదయ్య సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుని, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసాడు. కాగా, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని గురువారం బాధితుడికి అందించారు. ఈ సందర్భంగా ఎస్సై దాసరి సుధాకర్ మాట్లాడుతూ.. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే మీసేవాలో దరఖాస్తు చేసి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందించాలన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను తిరిగి పొందవచ్చని తెలిపారు.

# ఈ–పాస్‌తోనే ఎరువులు విక్రయించాలి



మల్హర్: డీలర్లకు సూచనలిస్తున్న ఏడీఏ శ్రీపాల్



టేకుమట్లలో..

- మహదేవపూర్ ఏడీఏ శ్రీపాల్

**మల్హర్:** ఈపాస్ ద్వారానే రైతులకు ఎరువులు విక్రయించాలని, ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మహదేవపూర్ ఏడీఏ కే శ్రీపాల్ డీలర్లను హెచ్చరించారు. మండలంలోని కొయ్యూరు రైతువేదికలో ఫెర్టిలైజర్ షాపు యజమానులతో గురువారం శ్రీపాల్ సమావేశం నిర్వహించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఆయన వెల్లడించారు. విత్తనాలు, ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. యూరియాకు పురుగుల మందులను రైతులకు అంటగటొద్దని స్పష్టం చేశారు. అవసరమైన ఎరువులను నిల్వలు ఉంచుకోవాలని డీలర్లు సూచించారు. కార్యక్రమంలో ఏఓ బి.శ్రీజ, ఏఈఓలు పద్వీ, శిరీష, అనూష, మండల డీలర్లు పాల్గొన్నారు.

**నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు**

**టేకుమట్ల:** ఫర్టిలైజర్ యజమానులు నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని భూపాలపల్లి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు రమేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు ఫర్టిలైజర్ దుఖాణాలను మండల వ్యవసాయాధికారి కల్యాణితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని పలు రిజిస్టర్లు, ఎరువులను, విత్తనాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ షాపు నిర్వాహకుడు తప్పనిసరిగా ఎరువుల లభ్యత, ధరల పట్టిక, స్టాక్ రిజిస్టర్లు వినియోగించాలన్నారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



కాటారం: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

**కాటారం:** యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కాటారం ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య, సివిల్ ఎస్సై2 శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా కాటారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ హై స్కూల్‌లో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం అధికారులు విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో ఫ్లెక్సీతో ప్రదర్శనిచ్చారు. ఈ సందర్భంగా ఎస్సైలు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలా జోలికి వెళ్లకూడదని, చెడు వ్యసనాలు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్, మత్తుపదార్థాల కారణంగా జీవితాలు నాశనం అవుతాయని పేర్కొన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది రాంచందర్, వెంకట్‌రాజు, కోటేశ్వర్, విమల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మొగుళ్లపల్లి: అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**మొగుళ్లపల్లి:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎఎస్సై రాజేశం మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**ములుగు రూరల్:** విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి గోపాల్‌రావు అన్నారు. గురువారం మండలంలోని బండారుపల్లి గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సైక్రియాసిస్ట్ నమ్రత, కిరణ్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ అమృతరెడ్డి ఉన్నారు.

# బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

**చిట్యాల:** మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన సాద ఓదేలు, మండల కేంద్రానికి చెందిన కట్కూరి మధునమ్మ, అల్లం అయిలయ్య ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గురువారం పరామర్శించారు. అలాగే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సకినాల కుమారస్వామి, ఎండి.హకీమ్‌పాషా కుటుంబ సభ్యులను చిట్యాల సివిల్ ఆస్పత్రిలో పరామర్శించారు. తిరుమలాపూర్ గ్రామానికి చెందిన కంచర్ల పోషాలు మృతి చెందగా అతని అంతిమయాత్రలో పాల్గొని వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్, మండల ప్రధాన కార్యదర్శులు రాజేందర్, రవీందర్‌రావు, నాయకులు దామెర రాజు, తదితరులు ఉన్నారు.

# విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు వద్ద రైతు మొగిలి

**భూపాలపల్లి రూరల్:** విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని గొల్ల బుద్దారంలో చోటు చేసుకొంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లబుద్దారం గ్రామానికి చెందిన నీలాల మొగిలికి చెందిన దుక్కిటెద్దు రోజు మాదిరిగా పొలాల్లోకి మేతకు వెళ్లింది. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైరుకు తగలడంతో షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.60 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

**ఆవు మృతి**

**మొగుళ్లపల్లి:** విద్యాదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన తులాల కుమారస్వామికి చెందిన ఆవు గడ్డి మేస్తుంది. ఈ క్రమంలో సాయంత్రం వీచిన గాలి దుమారంతో బావులకు వచ్చే కరెంటు లైన్ తెగి పడగా దానికి తగిలి షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని తనకు న్యాయం చేయాలని బాధిత రైతు కుమారస్వామి ప్రభుత్వాన్ని కోరారు.

# నిలిచిన ఆర్టీసీ సేవలు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



బస్సులకోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

**వెంకటాపురం(కె):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం నుంచి వెంకటాపురం మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సు సేవలు గురువారం నుంచి నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదం అని తెలిసిన ఆటోలను ఆశ్రయించి ప్రయాణం చేస్తున్నారు. మండల పరిధిలోని రాళ్లవాగు పిల్లార్ ఏప్రిల్ నెలలో కుంగిపోయింది. కాగా, బ్రిడ్జిపై నుంచి రాకపోకలను అధికారులు నిలిపివేశారు. దీంతో వాహనాలు నడిచేందుకు తాత్కాలిక రోడ్డును వాగులో ఏర్పాటు చేశారు. మండలంలో మూడు రోజులుగా వర్షం కురుస్తుండటంతో వాగులో ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు వద్ద వాహనాలు దిగబడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాగులో నుంచి వాహనాలు బయటకు తీసేందకు ట్రాక్టర్‌ను ఉపయోగించి బయటకు తీశారు. దీంతో ఆర్టీసీ అధికారులు మండలానికి బస్సు సేవలను నిలిపి వేశారు. ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ఆటోలకు డిమాండ్ పెరిగింది. వెంకటాపురం మండల కేంద్రం నుంచి ఎదిర గ్రామం వరకు ఉన్న గ్రామాల ప్రజల పనుల మీద మండల కేంద్రానికి వావాలంటే ఆటోలను ఆశ్రయించక తప్పటం లేదు. సూమారు 30 కిలో మీటర్ల దూరం ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ప్రమాదం అని తెలిసిన ఆటోల్లో ప్రయాణం చేస్తున్నారు. కాగా, రాళ్లవాగు వద్ద వంతెన పిల్లర్ నిర్మాణ పనులు నత్తనడక సాగుతున్నాయి. ఇప్పటికైన అధికారులు వంతెన పనులను వేగవంతం చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఆటోలో వెళ్తున్న ప్రయాణికులు



పూర్తి కాని రాళ్లవాగు బ్రిడ్జి నిర్మాణ పనులు